క్లుప్తంగా

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకం



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న డీఎస్పీ

గొల్లపల్లి: నేరాల నియంత్రణ, కేసుల చేధనలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. మండల కేంద్రంలోని కళ్యాణ రామచంద్రస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ తమ ఇండ్లలో, దుకాణాలలో,వీధులలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సైలు చిర్ర సతీశ్, మాడ శ్రీధర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ భూమయ్య పాల్గొన్నారు.

'సఖీ' సేవలు వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకురాలు

జగిత్యాల: సఖీ కేంద్రం అందించే సేవలు వినియోగించుకోవాలని నిర్వాహకులు శారద అన్నారు. బుధవారం టీఆర్‌నగర్‌లోని ఇటుక బట్టీల వద్ద మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి హింసకు గురైనా సఖీ సెంటర్‌కు నేరుగా గాని, హెల్ప్ లైన్ 181 ద్వారా గానీ ఆశ్రయించవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వనిత, రజిత పాల్గొన్నారు.

ఆహార శుద్ధి యూనిట్లపై అవగాహన



మాట్లాడుతున్న డీఆర్‌పీ రామకృష్ణ

కథలాపూర్: మండలకేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో పీఎంఎఫ్‌ఎంఈ లబ్ధిదారులకు ఆహార శుద్ధి ప్రాసెసింగ్ యూనిట్లపై బుధవారం అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. మార్కెట్‌లో నాణ్యమైన వస్తువులకు ప్రాధాన్యత ఉంటుందని, దానికి తగ్గట్టుగా వస్తువులు విక్రయించేందుకు మహిళలు సిద్ధం కావాలన్నారు. డిజిటల్ మార్కెటింగ్, కల్తీ లేని పదార్థాలు తయారీ గురించి వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌పీ రామకృష్ణ, నరహరి, వెంకటేశ్, సీసీలు పాల్గొన్నారు.

ఆయిల్ పాం సాగుపై ..

మల్యాల: మండలంలోని తాటిపల్లిలో బుధవారం ఆయిల్‌పాం సాగుపై మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చంద్రదీపక్ మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పాం సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో చంద్రదీపక్‌తోపాటు లోహియా కంపెనీ ప్రతినిధి ఎస్.అనిల్, ఏఈవో కారుణ్యకుమార్, కె.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి



పీఆర్‌టీయూ ఆవిర్భావ వేడుకల్లో ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గాదె నర్సింగరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులందరికీ ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మర్రి మహేశ్, స్వర్ణలత, ప్రభాకర్, నరేశ్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠినంగా శిక్షించాలి

జగిత్యాల: లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే కఠినంగా శిక్షించాలని పీసీపీఎన్‌డీటీ అడ్వైజరి కమిటీ సభ్యుడు తౌటు రాంచంద్రం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక కార్యకర్తగా నాకు సభ్యుడిగా అవకాశం ఇచ్చారని, స్త్రీ, పురుష నిష్పత్తిలో తేడాలు రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వెయ్యికి 930 మంది మాత్రమే స్త్రీలు ఉన్నారన్నారు.

వీర హనుమాన్ విజయయాత్ర



మెట్‌పల్లిలో బైక్ ర్యాలీలో హనుమాన్ దీక్షాపరులు

మెట్‌పల్లి: పట్టణంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం వీర హనుమాన్ విజయయాత్ర ఘనంగా నిర్వహించారు. స్థానిక కాశీభాగ్ హనుమాన్ ఆలయం నుంచి భక్తులు బైక్ ర్యాలీగా శివారులో ఉన్న అయ్యప్ప ఆలయం వరకు సాగింది. ర్యాలీలో భక్తులు నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి నవీన్‌కుమార్, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేష్, పోహార్ తుక్కారాం తదితరులు పాల్గొన్నారు.

మహిళల కుంకుమార్చన



కుంకుమార్చనలో మహిళలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయిలో స్వయంభూగా వెలసిన శ్రీసీతారాముల బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో కుంకుమార్చన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శకటోత్సవంతో పాటు, డోపుకథ నిర్వహించారు. గురువారం సాయంత్రం స్వామివారి రథోత్సవం ఉంటుందని ఉత్సవ నిర్వాహకులు పేర్కొన్నారు.

గ్రామాల్లో హనుమాన్ సంకీర్తన



రేచపల్లిలో హనుమాన్ దీక్షాపరుల గ్రామ సంకీర్తన

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామల్లో హనుమాన్ దీక్షాపరులు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం మండలంలోని రేచపల్లిలో హనుమాన్ గ్రామ సంకీర్తన నిర్వహించగా, మహిళలు మంగళహారతులకు స్వాగతం పలికి మొక్కులు చెల్లించుకున్నారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపన పూజల్లో హోమం నిర్వహిస్తున్న భక్తులు

రాయికల్: మండలంలోని తాట్లవాయిలోని చిన్నగట్టు పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



మైతాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్



జగిత్యాలలో సీమంతం చేస్తున్న అధికారులు

జగిత్యాల/జగిత్యాలరూరల్/రాయికల్/మెట్‌పల్లి రూరల్/కథలాపూర్/మల్లాపూర్/ సారంగాపూర్ /మల్యాల/పెగడపల్లి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. పోషణ్ పక్వాడా అభియాన్‌లో భాగంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలకు ఆరోగ్యసూత్రాలతో పాటు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మహిళలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ధర్మపురి: పేద ప్రజల సంక్షేమం కోసం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నాయకులు అన్నారు. బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక కర్నె అక్కపెల్లి కల్యాణ మండపంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు అదే ధోరణిలో నడుస్తుందని రెండు పార్టీల తీరుపై ప్రజల్లో నమ్మకం పోయిందని రానున్న రోజుల్లో ధర్మపురిలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కస్తూరి సత్యం, బండారి లక్ష్మణ్, బెజ్జారపు లవన్ కుమార్, మంచె రాజేశ్, పోగుల గుండయ్య తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్ : కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓరుగంటి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం వెల్గటూర్‌లో ఏర్పాటు చేసిన క్రియాశీల సభ్యుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న పంచాయితీ ఎన్నికల్లో పార్టీ అత్యధిక స్థానాలు గెలిచే విధంగా పార్టీ పటిష్ఠత కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ కన్వీనర్ కస్తూరి సత్యం, కో కన్వీనర్ లక్ష్మణ్, మండల బీజేపీ అధ్యక్షులు గోపతి జనార్దన్, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నాయకులు ప్రజలకు వివరించాలని బీజేపీ మండల ఇన్‌చార్జి వెంకటేశ్ అన్నారు. బుధవారం కథలాపూర్‌లో బీజేపీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రధాని మోదీ అన్ని వర్గాల సంక్షేమానికి పథకాలు అమలు చేస్తున్నారన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, నాయకులు గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, మహేశ్, ఆనంద్‌రెడ్డి, రవి, లక్ష్మీనర్సయ్య, సత్యం పాల్గొన్నారు.

పాలకుంట నుంచి నీరు విడుదల



తూము వద్ద వేసిన మట్టి తొలగిస్తున్న జేసీబీ

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్ శివారులోని పాటకుంట తూము నుంచి నీళ్లు వెళ్లకుండా వేసిన మట్టిని తొలగించి బుధవారం నీటిని విడుదల చేశారు. వివరాల్లోకి వెళితే .. పాలకుంటలో చేపలు పెంచుకునే కాంట్రాక్టర్ కుంటలో నీళ్లు తక్కువగా ఉండటంతో ఉన్న నీళ్లు వెళ్తే చేపలకు ఇబ్బంది అవుతుందని మంగళవారం తూముకు అడ్డంగా మట్టి వేసి కుంట నుంచి నీళ్లు వెళ్లకుండా చేశాడు. దీంతో పాలకుంట ఆయకట్టు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం పోలీసులు, ఇరిగేషన్ అధికారులు పాలకుంటను పరిశీలించి, కాంట్రాక్టర్‌తో మాట్లాడి మట్టిని జేసీబీతో తొలగించి ఆయకట్టుకు కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ సిరాజ్, ఎస్సై రాంచంద్రం గౌడ్, మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్య, రైతులు పాల్గొన్నారు.

రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

బుగ్గారం: తెలంగాణ బీసీ,ఎస్సీ,ఎస్టీ హక్కులు, రాజ్యాధికార సాధన జేఏసీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14 నుంచి ప్రారంభమయ్యే లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర పోస్టర్‌ను బుధవారం బుగ్గారం మండల కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఈ రథయాత్రలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, అశోక్,విష్ణు,వెంకటేశ్,చంద్రమౌళి,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి సహకారం

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి సహకారం అందిస్తామని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బైన ప్రశాంత్ అన్నారు. మండలంలోని వీవీరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో తన కుమారుడు రుద్ర్ పుట్టినరోజు సందర్భంగా పాఠశాలకు బెంచీలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దత్తాత్రేయ, ఉపాధ్యాయులు రాజశేఖర్, జలపతిరెడ్డి, ఆయేషా, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ ప్రారంభం



సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

ధర్మపురి: సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మకమని ఏఎంసీ చైర్మన్ చిలుముల లావణ్య లక్ష్మణ్ అన్నారు. మండలంలోని దొంతాపూర్, మగ్గిడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేందర్, సాయికిరణ్, సత్యనారాయణ తదితరులున్నారు.

కుంగ్-ఫూ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



ప్రశంసపత్రాలతో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు

ధర్మపురి: పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు కుంగ్-ఫూలో ప్రతిభను కనపర్చి ఎల్లో బెల్టులు సాధించినట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. రాణి లక్ష్మీబాయ్ ఆత్మరక్షణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బాలికలకు 3 నెలల పాటు కుంగ్-ఫూ లో శిక్షణలు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రిన్సిపాల్ జ్యోతి ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ భారతి, కోచ్ కస్తూరి ప్రవీణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే నివాళి



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

మల్యాల: మండలంలోని ముత్యంపేట మాజీ సర్పంచ్ మల్యాల పోచయ్య బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. పోచయ్య 2001 నుంచి 2006 వరకు ముత్యంపేట సర్పంచ్‌గా సేవలందించారు. పోచయ్య మృతదేహానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నివాళి అర్పించి, కుటుంబాన్ని ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట దారం ఆదిరెడ్డి, మారంపల్లి లక్ష్మణ్, ముత్యం శంకర్, మ్యాక లక్ష్మణ్,అల్లూరి రాజేశ్వర్, రాంలింగారెడ్డి, బత్తిని శ్రీనివాస్ హరినాథ్ ఉన్నారు.

ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లి: విద్యుత్ ప్రమాదాల పట్ల సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డీఈ గంగారాం సూచించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఎన్పీడీసీఎల్ నూతన ంగా ఆవిష్కరించిన ఎల్‌సీ యాప్‌పై డివిజన్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా సిబ్బందికి లైన్ క్లియరెన్స్ పనులు సులభతరమవుతాయన్నారు. కార్యక్రమంలో ఏడీఈలు మనోహర్, హరీష్, అంజన్‌రావు, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి నిజామాబాద్ జిల్లా పోర్లికొండ గ్రామానికి చెందిన అక్కవత్రి సంతోష్ కుమారుడు జ్యోయాత్ హర్ష పుట్టినరోజును పురస్కరించుకుని రూ. 10వేలు విరాళం బుధవారం అందచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అచ్చ విజయ భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్‌లో ఈనెల 4న రోడ్డు ప్రమాదానికి కారకుడైన ఎండీ.ఫరీద్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. జగిత్యాల పట్టణానికి చెందిన చీటి శిరీష, ఆమె కుమారుడు స్వరూప్, ఆమె తల్లి అంజలి ఈనెల 4న కరీంనగర్ రోడ్‌లో ద్విచక్ర వాహనంపై వెనుక నుంచి అతివేగంగా వచ్చి ఎండీ.ఫరీద్ వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. శిరీష భర్త చీటి సంతోష్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థుల హాజరు శాతం పెంపునకు వినూత్న కార్యక్రమం



వంద శాతం హాజరైన విద్యార్థులకు బహుమతులు

కథలాపూర్: మండలంలోని బొమ్మెన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గత నెలలో 100 శాతం పాఠశాలకు హాజరైన విద్యార్థులకు ఉపాధ్యాయులు బుధవారం బహుమతులు అందించారు. పాఠశాలలో 32 మంది విద్యార్థులు 100 శాతం హాజరు కావడం విశేషం. కార్యక్రమంలో హెచ్‌ఎం అంబటి రవి, ఉపాధ్యాయులు సాయిరెడ్డి, రమేశ్, శివ, ప్రశాంత్, శిరీష పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న విద్యార్థి నాయకులు

బుగ్గారం: నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్‌యూఐ)55వ ఆవిర్భావ వేడుకలను ధర్మపురి పట్టణంలోని నంది కూడలిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ ఇన్‌చార్జి యశోద జశ్వంత్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల కోసం ఎన్ఎస్‌యూఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాందేని మొగిలి,అప్పం తిరుపతి, భూపతి విఘ్నేశ్, బొల్లారపు పోషన్న, రాపర్తి సాయికిరణ్, కాశెట్టి రాజేశ్, కోరుట్ల సాయి తదితరులు పాల్గొన్నారు.



కథలాపూర్: మండలంలోని ఊట్‌పెల్లిలోని ప్రధానరోడ్డుపై 20 రోజుల క్రితం సీసీ రోడ్డు నిర్మించారు. గుంతల రోడ్డు బాధలు తప్పాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కానీ సీసీ రోడ్డు నిర్మించినప్పటి నుంచి గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడంలేదని ప్రజలు వాపోతున్నారు. సుమారు 2 కిలోమీటర్ల దూరం కాలినడకన భూషణరావుపేట గ్రామానికి వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్తులు తెలిపారు. ఆర్టీసీ అధికారులు చొరవ చూపి యథావిధిగా బస్సు నడిపించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి:
మనోహర్, ఆర్టీసీ డిపోమేనేజర్, కోరుట్ల : 9959225928

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ కృషి



నివాళి అర్పిస్తున్న నర్సింగరావు, నాయకులు

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ నుంచి తిమ్మాయపల్లె వరుకు కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్‌లో భాగంగా కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో యూసుఫ్‌నగర్‌లో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అయిలాపూర్ మీదుగా తిమ్మాయపల్లె వరకు పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, నాయకులు గుగ్గిళ్ల సురేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేట,ఏఎస్‌ఆర్ తండా,రంగారావుపేట గ్రామాల్లో బుధవారం జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పోరాడుతుందన్నారు.అ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు సురేశ్,నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాలల వార్షికోత్సవం



గుల్లకోట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

వెల్గటూర్ : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని గుల్లకోట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చందూరి రాజిరెడ్డి అన్నారు. బుధవారం రోజు ఎండపల్లి మండలం గుల్లకోట ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి పూర్తి చేసి ఆరవ తరగతికి వెళ్లబోయే విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, మాలతి, ప్రశాంత్ నరేష్, కృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజారం పాఠశాలలో వార్షికోత్సవ సంబరాలు

ధర్మపురి: మండలంలోని రాజారం ప్రాథమిక పాఠశాలలో బుధవారం పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంఈవో సీతామహాలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శనలు, సంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్ వెంకటరమణ, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.